సాక్షి పశ్చిమగోదావరి

శుక్రవారం ∣ 15 ∣ ఆగస్టు ∣ 2025



మన్యం వీరుల పోరు అజరామరం

బ్రిటీష్ వారిపై తిరుగుబాటు చేసి ఉరి కొమ్మలకు వేలాడి ప్రాణాలు విడిచిన గిరిజన పోరాట వీరులు ఎందరో ఉన్నారు.

IIలో ▸



ఉపాధ్యాయులకూ పరీక్షే

ఈనెల 11 నుంచి నిర్వహిస్తున్న ఎఫ్ఏ-1 పరీక్షల్లో విద్యార్థుల సామర్థ్యానికి మించి ప్రశ్నలు రావడం ఉపాధ్యాయులకు పరీక్షలా మారింది.

IIలో ▸



లారీ బీభత్సం

ద్వారకాతిరుమల చినవెంకన్న క్షేత్రంలో లారీ బీభత్సాన్ని సృష్టించింది. రెండు కార్లను, ఆటోను ఢీకొట్టింది.

IIలో ▸

న్యూస్‌రీల్

ముంపు చేల పరిశీలన



తిరుపతిపురంలో చేలను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

అత్తిలి: మండలంలోని తిరుపతిపురం, వరిఘేడు ప్రాంతాల్లో నీట మునిగిన పంట పొలాలను గురువారం కలెక్టర్ సీహెచ్ నాగరాణి పరిశీలించారు. రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో బుధవారం ఒక్కరోజు 1799.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందన్నారు. దీంతో సుమారు 400 నుంచి 500 ఎకరాల వరకు పొలాలు ముంపు బారిన పడ్డాయన్నారు. ప్రస్తుతం వర్షం ఆగినందున నీరు తొలగితే ఇబ్బంది ఉండదని, వ్యవసాయాధికారులు పంట నష్టం వివరాలు నమోదు చేస్తారన్నారు. తహసీల్దార్ దశిక వంశీ, సిబ్బంది ఉన్నారు.

90 మి.మీ. సగటు వర్షపాతం

భీమవరం: జిల్లాలో గురువారం ఉదయం వరకు 20 మండలాల్లో సగటున 90 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా తణుకులో 236.6 మి.మీ., అత్యల్పంగా మొగల్తూరులో 8.6 మి.మీ. వర్షం పడింది. మండలాల వారీగా వర్షపాతం ఇలా.. తాడేపల్లిగూడెంలో 162.2 మి.మీ, పెంటపాడులో 189, అత్తిలిలో 85.4, గణపవరంలో 144.4, ఆకివీడులో 77.2, ఉండిలో 54.4, పాలకోడేరులో 76.2, పెనుమంట్రలో 75.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఇరగవరంలో 196.6, పెనుగొండలో 193.8, ఆచంటలో 40.2, పోడూరులో 82.6, వీరవాసరంలో 22.2, భీమవరంలో 27.6, కాళ్లలో 42.6, నరసాపురంలో 32.4, పాలకొల్లులో 35.2, యలమంచిలిలో 17.4 మి.మీ వర్షపాతం నమోదైంది.

నీటి సంరక్షణకు చర్యలు

భీమవరం (ప్రకాశంచౌక్): భూగర్భ జలాల పెంపు, నీటి సంరక్షణ, నీటి నిర్వహణ తదితర అంశాలపై అమరావతి నుంచి గురువారం కలెక్టర్లు, సాగునీటి సంఘాల, ప్రాజెక్ట్ సంఘాల ప్రతినిధులు, జలవనరుల శాఖ అధికారులతో సీఎం చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. భీమవరం కలెక్టరేట్ నుంచి కలెక్టర్ సీహెచ్ నాగరాణి, జేసీ టి.రాహుల్‌కుమార్ రెడ్డి, డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, అధికారులు హాజరయ్యారు. నీటి సంరక్షణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

తాగునీటి కోసం ధర్నా



మండవల్లిలో రోడ్డుపై బైఠాయించిన మహిళలు

మండవల్లి: మండవల్లిలోని స్టేషన్ రోడ్డులో తాగునీటి సమస్య పరిష్కరించాలంటూ గురువారం జాతీయ రహదారిపై గ్రామస్తులు ధర్నాకు దిగారు. 20 రోజుల నుంచి కుళాయిల నుంచి తాగునీరు రావడం లేదని, తమను పట్టించుకునే నాథుడే లేడంటూ మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. సర్పంచ్, అధికారులు వచ్చి సమాధానం చెప్పాలంటూ భీష్మించారు. కొద్దిసేపటికి పోలీసులు వచ్చి వారికి నచ్చజెప్పి ధర్నాను విరమింపజేశారు. తమ గోడు ఎవరూ పట్టించుకోవడం లేదని, ఎన్ని రోజులు ఓపిక పట్టాలని మహిళలు పోలీసుల వద్ద వాపోయారు.

వాగు ప్రవాహానికి కొట్టుకుపోయిన రోడ్డు



వంకవారిగూడెం వద్ద కొట్టుకుపోయిన రోడ్డు

బుట్టాయగూడెం: గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా జీలుగుమిల్లి మండలం వంకవారిగూడెం సమీపంలోని రోడ్డు గురువారం ఉదయం కొట్టుకుపోయింది. దీనితో పై గ్రామాలకు రహదారిపై వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. అధికారులు వెంటనే స్పందించి రహదారి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వికసిత్ భారత్‌పై వర్క్‌షాప్

ఏలూరు(మెట్రో): ఏలూరు కలెక్టరేట్‌లో గురువారం వికసిత్ భారత్ 2047 లక్ష్యంగా స్కూలింగ్-బిల్డింగు బ్లాక్స్ అనే అంశంపై విద్యాశాఖ అధికారులతో కలెక్టర్ వెట్రిసెల్వి వర్క్‌షాప్ నిర్వహించారు. దేశం మొదటి స్థానంలో నిలిచే లక్ష్యంగా అన్ని రంగాల్లో నిరంతర లక్ష్యాలు, నిర్దేశం, సాధన చాలా అవసరమన్నారు. మానవ వనరుల అభివృద్ధి యువత, వయోజనులు, మహిళలపై నిర్మించబడి ఉందన్నారు.

సేవకులకు వంచన

ఏరు దాటేదాకా ఓడ మల్లన్న.. ఏరు దాటాకా బోడి మల్లన్న చందాన ఉంది కూటమి తీరు. వలంటీర్లను కొనసాగిస్తాం, పారితోషికం నెలకు రూ.10 వేలకు పెంచుతామని చెప్పిన కూటమి పెద్దలు ఇప్పుడు ఆ ఊసే ఎత్తకపోవడంతో వలంటీర్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. రాష్ట్రంలో వలంటీర్ వ్యవస్థ మొదలై శుక్రవారానికి ఆరేళ్లు కాగా కూటమి ప్రభుత్వ నిర్వాకంతో 16 నెలలుగా వీరి సేవలు నిలిచిపోయాయి.



కొనసాగిస్తామని మాటిచ్చి..

ఎన్నికల సంఘానికి కూటమి అనుకూల వర్గాల ఫిర్యాదుల నేపథ్యంలో గతేడాది ఏప్రిల్ నుంచి వలంటీర్ల సేవలు నిలిచిపోయాయి. తాము అధికారంలోకి వస్తే వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తామని, గౌరవ వేతనం రూ.10 వేలకు పెంచుతామని ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు హామీలు గుప్పించారు. మేనిఫెస్టోలోనూ ఈ అంశాన్ని చేర్చారు. కూటమి పాలన చేపట్టి ఏడాది పైబడినా హామీ అమలు దిశగా చర్యలు చేపట్టకపోగా వలంటీర్లను నిబంధనలు మేరకు తీసుకోలేదంటూ ప్రభుత్వ పెద్దలు ప్రకటనలు చేయడం గమనార్హం. ప్రభుత్వ తీరుతో తమ భవితవ్యం అగమ్యగోచరంగా మారిందని వలంటీర్లు ఆందోళన చెందుతున్నారు. కూటమి ఎన్నికల వాగ్దానం అమలుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కూటమి వెన్నుపోటు

- ప్రభుత్వానికీ ప్రజలకు వారధిలా పనిచేసిన వలంటీర్లు
- పారదర్శకంగా పథకాల అమలుకు దోహదం
- గౌరవ వేతనం రూ.10 వేలు చేస్తామని చంద్రబాబు, పవన్ కళ్యాణ్ హామీ
- అధికారంలోకి వచ్చాక ఆ ఊసెత్తని కూటమి పెద్దలు
- నేటితో వలంటీర్ వ్యవస్థకు ఆరేళ్లు
- జిల్లాలో 8,616 మంది వలంటీర్ల సేవలు



కోవిడ్ సమయంలో ఆకివీడులో ప్రజలకు కూరగాయలు అందిస్తున్న దృశ్యం (ఫైల్)



ఆస్పత్రిలో లబ్ధిదారుడికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ (ఫైల్)

'వలంటీర్లలో చాలా సమర్థత ఉంది. మేం అధికారంలోకి వస్తే వారిని ఉద్యోగాల నుంచి తీయబోం. వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తాం. వారికి ఇస్తున్న గౌరవ వేతనాన్ని రూ.10 వేలకు పెంచే బాధ్యత నేను తీసుకుంటాను'.

– ఎన్నికల్లో చంద్రబాబు హామీ

'వలంటీర్లు నా అక్కాచెల్లెళ్లు. ఏ రోజూ కూడా నాకు వారి పొట్టకొట్టాలన్న ఉద్దేశం లేదు. మీకు రూ.5 వేలు వస్తే.. మరో రూ.5 వేలు అదనంగా ఇచ్చే మనసున్న వాణ్ణి'.

– ఎన్నికల్లో పవన్ కళ్యాణ్ హామీ

సాక్షి, భీమవరం: కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హుల చెంతకే సంక్షేమ పథకాలు చేరవేసే లక్ష్యంతో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ల వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. గ్రామాల్లో 50 ఇళ్లకు, పట్టణాల్లో 75 నుంచి 100 ఇళ్లకు ఒకరు చొప్పున జిల్లాలో 8,616 మంది వలంటీర్లను నియమించారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిలా 2019 ఆగస్టు 15న వలంటీర్ వ్యవస్థను ప్రారంభించారు. క్షేత్రస్థాయిలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల లబ్ధిని అందేలా చూడటం, అవసరమైన సర్టిఫికెట్లు మంజూరు చేయించడం, విద్యుత్ బిల్లుల చెల్లింపులు తదితర సేవలందించేవారు. కరోనాకు జడిసి సొంతవాళ్లు, చుట్టుపక్కల వారు దగ్గరకు రాలేని పరిస్థితుల్లో బాధితులకు బాసటగా నిలిచారు. హోం క్వారంటైన్‌లో ఉన్న వారికి ప్రభుత్వం ద్వారా ఆహారం, నిత్యావసర సరుకులు, మందులు అందజేసేవారు. కరోనా పరీక్షలు, వ్యాక్సినేషన్ ప్రక్రియలో వీరు ఎనలేని సేవలందించారు. గోదావరి వరదల సందర్భంగా నీట మునిగిన లంక గ్రామాల ప్రజలకు ప్రభుత్వం నుంచి అవసరమైన సరుకులు, మందులు ఇంటింటికి వెళ్లి అందజేస్తూ వలంటీర్లు అందించిన సేవలు చిరస్మరణీయం. అనారోగ్యంతో ఇతర రాష్ట్రాల్లో చికిత్స పొందుతున్న లబ్ధిదారుల చెంతకు సైతం వెళ్లి ప్రభుత్వ సాయాన్ని అందజేస్తూ ఆదర్శంగా నిలిచిన వారెందరో ఉన్నారు. కేవలం రూ.5 వేల గౌరవ వేతనంతో పారదర్శకంగా సేవలందించిన వలంటీర్ వ్యవస్థ దేశవ్యాప్తంగా ప్రముఖుల ప్రశంసలు అందుకుంది. వలంటీర్ వ్యవస్థపై మొదట్లో 'గోనె సంచులు మోసే అవేం ఉద్యోగాలు' అంటూ చిన్నచూపు చూసిన చంద్రబాబు, మహిళల మిస్సింగ్‌కు వలంటీర్లే కారణమంటూ విషం కక్కిన పవన్ కళ్యాణ్‌లు ఎన్నికలు వచ్చేసరికి మాట మార్చారు.

హామీని అమలుచేయాలి



ప్రజలకు నిస్వార్థంగా సేవలందించాం. కోవిడ్‌కు జడిసి ఎవరూ బయటకురాని సమయంలో ఇంటింటికీ వెళ్లి మందులు అందజేశాం. వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తామని, పారితోషికం రూ.10 వేలకు పెంచుతామని ఎన్నికల్లో ఇచ్చిన మాటను కూటమి ప్రభుత్వం నిలుపుకోవాలి.

– హెచ్‌వీకే చక్రవర్తి, వెలగలేరు, పెనుమంట్ర మండలం

వలంటీర్లను వంచించారు



వలంటీర్ల పొట్టకొట్టబోమని, తాము అధికారంలోకి వస్తే పారితోషికం రూ.10 వేలకు పెంచుతామని ఎన్నికల్లో పదేపదే చెప్పిన కూటమి నాయకులు తర్వాత ఆ ఊసే ఎత్తడం లేదు. ఎన్నికల వాగ్దానం అమలు కోసం రాష్ట్రవ్యాప్తంగా వలంటీర్లు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు.

– దిద్ల సత్యానందం, తణుకు

హామీలను తుంగలో తొక్కి..



జగనన్న వలంటీర్ ఉద్యోగాలు ఇచ్చి స్థానికంగా ఉపాధి కల్పించారు. అయితే కూటమి నాయకులు అధికారంలోకి వస్తే జీతాలు పెంచుతామని హామీ ఇచ్చి తుంగలో తొక్కారు. మా ఉద్యోగాలు ఊడగొట్టి నోటికాడ కూడు లాగేసుకున్నారు.

– ఎస్.లీలా ప్రియ, కుముదవల్లి

మా పొట్ట కొట్టొద్దు

గళమెత్తిన ఆటో కార్మికులు

భీమవరం/తణుకు అర్బన్/తాడేపల్లిగూడెం (టీఓసీ)/పాలకోడేరు/అత్తిలి/పెనుమంట్ర/ఆకివీడు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న ఉచిత బస్సు పథకంతో తాము జీవనోపాధి కోల్పోతామంటూ గురువారం జిల్లావ్యాప్తంగా ఆటో డ్రైవర్లు, కార్మికులు నిరసన తెలిపారు. బంద్‌లు, ధర్నాలతో ఆందోళన వ్యక్తం చేశారు. భీమవరంలో ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు యింటి సత్యానారాయణ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 6 లక్షల మంది, జిల్లాలో 16 వేల మంది ఆటోలనే ఆధారంగా జీవనం సాగిస్తున్నారన్నారు. వారంతా రోడ్డున పడతారన్నారు. తణుకులో రాష్ట్రపతి రోడ్డు, సొసైటీ రోడ్డు, వేల్పూరు రోడ్డు, ఉండ్రాజవరం రోడ్డుతోపాటు రైల్వేస్టేషన్ ప్రాంతంలోని ఆటో యూనియన్ల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలోని భారతమాత ఆటోయూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు పంగం రాంబాబు, కంచుమర్తి విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో ధర్నా చేశారు. తాడేపల్లిగూడెంలో సుమారు 22 యూనియన్ల నాయకులు, ఆటో డ్రైవర్లు టెంట్లు వేసి నిరసన తెలిపారు. పట్టణంలో 24 గంటల పాటు ఆటోలను నిలుపుదల చేశారు. పాలకోడేరులోని రావిచెట్టు సెంటర్ వద్ద మహాత్మా గాంధీ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అత్తిలి బస్‌స్టేషన్ సెంటర్‌లో ఆటో కార్మికులు నిరసన తెలిపారు. పెనుమంట్ర మండలంలో ఆటో డ్రైవర్లు బంద్ పాటించి తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఆకివీడులో అంబేడ్కర్ ఆటో యూనియన్ నాయకులు నిరసన తెలిపారు. ఆటోలను నిలుపుదల చేసి బంద్ పాటించారు.



తాడేపల్లిగూడెం (టీఓసీ): పోలీస్ ఐలాండ్ సెంటర్‌లో నిరసన తెలుపుతున్న ఆటో డ్రైవర్లు



పాలకోడేరు: రావిచెట్టు సెంటర్‌లో నిరసన



భీమవరం: భీమవరంలో నిరసన ప్రదర్శన



ఆకివీడు: ఆకివీడు పాత బస్టాండ్ సెంటర్‌లో..



అత్తిలి: బస్‌స్టేషన్ సెంటర్‌లో..



పెనుమంట్ర: బ్రాహ్మణచెర్వు సెంటర్‌లో..



తణుకు అర్బన్: నిరసన తెలుపుతూ..

గవర్నర్‌తో మీట్ ఎట్‌కు నాగేంద్రసింగ్



ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గవర్నర్ కార్యాలయంలో గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో జరిగే మీట్ ఎట్ కార్యక్రమానికి ఏలూరు జిల్లా నుంచి నాగేంద్ర సింగ్ ఎంపికయ్యారు. నాగేంద్రసింగ్ ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని ఎంపీయూపీ స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తున్నారు. అంతర్జాతీయ స్థాయి దివ్యాంగుల క్రికెట్ పోటీలకు అంపైర్‌గా కూడా సేవలందిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం గవర్నర్ ఇచ్చే తేనీటి విందులో పాల్గొని గవర్నర్ నుంచి సన్మానం అందుకోనున్నారు.

20న స్పాట్ కౌన్సెలింగ్

తాడేపల్లిగూడెం: వెంకట్రామన్నగూడెంలోని ఉద్యాన వర్సిటీలో డిప్లమో హార్టికల్చర్, డిప్లమో ల్యాండ్ స్కేపింగ్, నర్సరీ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశాలకు తుది విడత స్పాట్ కౌన్సెలింగ్‌ను ఈనెల 20న నిర్వహించనున్నారు. ఈ మేరకు రిజిస్ట్రార్ బి.శ్రీనివాస్ ప్రకటన విడుదల చేశారు. నాలుగు ప్రభుత్వ, మూడు గుర్తింపు పొందిన పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశానికి గతంలో దరఖాస్తు చేసుకున్నా, కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి ఉద్యాన వర్సిటీ ప్రాంగణంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు ధ్రువీకరణ పత్రాలతో స్వయంగా హాజరుకావాలని సూచించారు.

● విద్యార్థులతో మట్టి చాకిరీ



హాస్టల్ ప్రాంగణాన్ని మట్టితో చదును చేస్తూ..

విద్యార్థులకు విద్యాబుద్ధులు చెప్పి ప్రయోజకులను చేయాల్సిన వారు ఇలా మట్టి పని చేయించారు. భారీ వర్షానికి ఏలూరు అమీనాపేట ఏటిగట్టుపై ఉన్న బాలుర సంక్షేమ హాస్టల్ ప్రాంగణంలో వర్షం నీరు నిలిచి బురదగా మారింది. దీంతో హాస్టల్ సిబ్బంది విద్యార్థులతో మట్టి వేయించి చదును చేయిస్తున్నారు. ప్రాంగణంలోని చెత్తను ఎత్తించి పిల్లలతో కాల్పించారు. విద్యార్థులతో పనులు చేయించడం విమర్శలకు తావిస్తోంది. గురువారం విద్యార్థుల పనులు చేస్తున్న దృశ్యాలు 'సాక్షి' కెమెరాకు చిక్కాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్/ ఏలూరు



చెత్తను కాల్చుతున్న విద్యార్థులు



చెత్తను ఏరుతూ..

స్వాతంత్ర్య దినోత్సవాలకు సర్వం సిద్ధం

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరంలోని కలెక్టరేట్ వద్ద పరేడ్ గ్రౌండ్స్ స్వాతంత్ర్య దినోత్సవాలకు సిద్ధమైంది. ఐదు వేదికలు, గ్యాలరీ, స్టాల్స్, శకటాలను గురువారం జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. వేడుకల నిర్వహణ సందర్భంగా ప్రభుత్వ పథకాలను ప్రతిబింబించేలా శకటాలు, స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ప్రొటోకాల్‌ను అనుసరించి సిట్టింగ్, స్టేజీ ఏర్పాట్లు, తాగునీటి సరఫరా, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్‌కు పటిష్ట ఏర్పాట్లు చేశామన్నారు. విద్యుత్‌లో సరఫరాలో ఆటంకం లేకుండా చూడాలన్నారు. వైద్య శిబిరం, అంబులెన్స్ సిద్ధంగా ఉంచాలన్నారు. ఉపరితల ద్రోణి కారణంగా భారీ వర్షాలు, బలమైన గాలులు వీచే అవకాశం ఉందని అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డీఆర్వో మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



త్రివర్ణ కాంతులతో కలెక్టరేట్ భవనం



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

తమ్మిలేరు ప్రాజెక్టుకు స్వల్పంగా వరద



చిన్నంపేటలో ప్రవహిస్తున్న వరద నీరు

చాట్రాయి: రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో మండలంలోని తమ్మిలేరు రిజర్వాయర్ ప్రాజెక్టుకు స్వల్పంగా వరద నీరు చేరుతోంది. మండలంలో బుధవారం రాత్రి నుంచి భారీ వర్షం కురవడంతో చెరువులు, కాలువల్లోని నీరు రిజర్వాయర్ ప్రాజెక్టులోకి చేరుతుంది. మండలంలో 55.5 మిల్లీమీటర్ల వర్షపాత నమోదయ్యింది. 850 క్యూసెక్కుల వరద నీరు చేరుతుందని, ప్రాజెక్టు నీటిమట్టం 255 అడుగులు కాగా ప్రస్తుతం 233 అడుగులు ఉందని టీఆర్పీ అధికారులు తెలిపారు.

క్లుప్తంగా

పార్టీ కాకినాడ జిల్లా మహిళా విభాగం ఇన్‌చార్జిగా జయసరిత



పాలకొల్లు సెంట్రల్: వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా మహిళా విభాగం ఇన్‌చార్జిగా పాలకొల్లుకు చెందిన రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి క్రరా జయసరితను నియమించారు. ఈ సందర్భంగా తనకు పదవి కల్పించిన పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు వరుది కళ్యాణి, ఉభయగోదావరి జిల్లాల కోఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ, పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకుడు ముదునూరి మురళీ కృష్ణంరాజు, జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు, నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీ హరిగోపాలరావుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

'ఎట్ హోం'కు రమేష్ ఎంపిక



అత్తిలి: మంచిలి గ్రామానికి చెందిన దివ్యాంగ సంఘటన సంఘ నాయకుడు నండూరి రమేష్ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర గవర్నర్ నిర్వహించే ఎట్ హోం కార్యక్రమానికి ఎంపికయ్యారు. ఏటా స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర గవర్నర్ ప్రముఖులతో ఎట్ హోమ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. అందులో భాగంగా దివ్యాంగుల కోట కింద మంచిలి గ్రామానికి చెందిన నండూరి రమేష్‌ను జిల్లా అధికారులు ఎంపిక చేశారు. దివ్యాంగుల సంక్షేమం కోసం రమేష్ పలు సేవా కార్యక్రమాలు నిర్వహించి జాతీయ స్థాయిలో ఉత్తమ అవార్డులు కూడా గతంలో పొందారు.

హుండీల దొంగ అరెస్ట్

నూజివీడు: దేవాలయాలు, ప్రార్థనా మందిరాల్లో హుండీలను చోరీ చేసిన దొంగను చాట్రాయి పోలీసులు అరెస్టు చేశారు. డీఎస్పీ కేవీవీఎన్‌వీ ప్రసాద్ గురువారం నూజివీడులో వివరాలు వెల్లడించారు. ఈనెల 13న సాయంత్రం చాట్రాయి ఊరి చివర పోలవరం వెళ్లే రోడ్డు మలుపులో ఉన్న ఆంజనేయస్వామి గుడి వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా చాట్రాయి వైపు నుంచి పోలవరం వైపునకు మోటార్‌సైకిల్‌పై వెళ్తూ అనుమానాస్పదంగా వ్యవహరిస్తున్న పటాన్ సలార్‌ఖాన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. ఏలూరు నగరంలోని పడమట వీధికి చెందిన పటాన్ సలార్‌ఖాన్(56)పై ఇప్పటి వరకు 51 దొంగతనం కేసులు ఉండగా ఏలూరు జిల్లాలో 25, నెల్లూరు జిల్లాలో 23, ఎన్‌టీఆర్ జిల్లాలో 3 చొప్పున కేసులు ఉన్నాయి. ఇతని వద్ద నుంచి రూ.5,900 నగదు, మోటర్ సైకిల్‌ను రికవరీ చేశారు. నిందితుడిని అరెస్టు చేయడంలో ప్రతిభ చూపిన నూజివీడు సీఐ కొప్పిశెట్టి రామకృష్ణ, చాట్రాయి ఎస్సై డీ రామకృష్ణ, హెడ్ కానిస్టేబుళ్లు ఎం విజయ్‌భాస్కర్, జీ శ్రీనివాసరావు, కానిస్టేబుళ్లను అభినందించారు.

ఒంటరితనాన్ని భరించలేక..

టి.నరసాపురం: ఒంటరి జీవితాన్ని భరించలేక ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం కె.జగ్గవరంలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి హెచ్‌సీ కె.వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం కె.జగ్గవరం గ్రామానికి చెందిన బర్రి రాజేష్ (35) పదేళ్ల క్రితం తన పెద్దక్క కుమార్తెను వివాహం చేసుకున్నాడు. పెళ్లయిన నెల రోజులకే ఆమె రాజేష్‌ను విడిచి వెళ్లిపోయింది. ఈ క్రమంలో రాజేష్ తల్లి వద్ద ఉంటున్నాడని అతనికి చిన్నప్పటి నుంచి కొంచెం మతిస్థిమితం సరిగా లేకపోవడం వల్ల అప్పుడప్పుడు ఫిట్స్ వచ్చేదన్నారు. ఈ నేపథ్యంలో ఒంటరి జీవితాన్ని భరించలేక ఈనెల 13న గుర్తు తెలియని మందు తాగి ఇంటివద్ద ఆత్మహత్యాయత్నం చేసుకోవడంతో, స్థానికులు గుర్తించి చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాజేష్ మృతి చెందాడు. రాజేష్ అన్న ఏలియా ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు హెచ్‌సీ తెలిపారు.

మన్యం వీరుల పోరు అజరామరం

దేశం కోసం ప్రాణాలర్పించిన ధీరులు

బుట్టాయగూడెం: బ్రిటీష్ వారిపై తిరుగుబాటు చేసి ఉరి కొమ్ములకు వేలాడి ప్రాణాలు విడిచిన గిరిజన పోరాట వీరులు ఎందరో ఉన్నారు. వారి పోరాటాలు, త్యాగాలకు చారిత్రక ఆధారాలు లేకపోయినా ఆనాటి శిథిల భవనాల్లో ఆ జ్ఞాపకాలు నేటికీ సజీవంగానే ఉన్నాయి. ఆ అమర వీరులను దేశ స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా స్మరించుకుందాం.

- తెల్ల దొరలను గడగడలాడించిన మన్యం బిడ్డలు
- బ్రిటీష్ వారికి పోరాటయోధులను పట్టించిన వెన్నుపోటుదారులు
- 8 మంది వీరులను ఉరితీసిన బ్రిటీష్ పాలకులు

వెలుగులోకి రాని వీరుల త్యాగం

తెల్లదొరలను ఎదురించి ప్రాణాలు పోగొట్టుకున్న వారిలో నలుగురు అజ్ఞాత స్వాతంత్ర్య పోరాట వీరులు పశ్చిమ మన్యానికి చెందిన వారు ఉన్నారు. అల్లూరి సీతారామరాజుకి ముందే వీరు పోరాటం చేసి మృతి చెందినప్పటికీ ఆ గిరిజన వీరుల త్యాగాలు వెలుగులోకి రాలేదు. ఆ నలుగురు వీరులు కారుకొండ సుబ్బారెడ్డి, కుర్ల సీతారామయ్య, కుర్ల వెంకట సుబ్బారెడ్డి, గురుగుంట్ల కొమ్మురెడ్డి. వీరు 1858లో బ్రిటీష్ పాలనకు ఎదురు తిరిగి తమ ప్రాణాలను తృణప్రాయంగా విడిచినట్లు చరిత్ర తెలిసిన పూర్వీకులు చెబుతున్నారు.

తిరుగుబాటులో కారుకొండ సుబ్బారెడ్డి కీలకం

1857లో యావత్ భారతదేశంలో స్వాతంత్ర్య సమరం ప్రారంభమైనప్పుడు దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో బ్రిటీష్ వారిపై తిరుగుబాటు జరిగింది.



కారుకొండ సుబ్బారెడ్డి ప్రతీకాత్మక చిత్రం

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పోలవరం మండలం కొరుటూరుకు చెందిన కొండరెడ్డి గిరిజన తెగకు చెందిన కారుకొండ సుబ్బారెడ్డి పోలవరం పరిసరాల ప్రాంతంతో పాటు బుట్టాయగూడెం నుంచి యర్నగూడెం వరకూ ఉన్న గిరిజన గ్రామాలకు జమిందారుగా ఉండేవారు. ఆయన స్వాతంత్ర్య సమరం జరుగుతున్న సమయంలో యర్నగూడెంలో ఆంగ్లేయులపై తిరుగుబాటు చేశాడు. ఆ సమయంలో గోదావరి దిగువ ప్రాంతంలో ఉన్న సుమారు 40 గ్రామాలతో బ్రిటీష్ వారిపై దండయాత్ర చేసి విజయం సాధించారు. సుబ్బారెడ్డికి ముఖ్య అనుచరుడిగా కుర్ల సీతారామయ్య ఉండేవారు. అలాగే గురుగుంట్ల కొమ్మురెడ్డి, అప్పటి తూర్పుగోదావరి జిల్లా కొండమొదలు గ్రామానికి చెందిన కుర్ల వెంకటరెడ్డి కలిసి తెల్లదొరలపై వీరోచిత పోరాటం చేశారు. ఆ సమయంలో సుబ్బారెడ్డి తలకు బ్రిటిష్ వారు రూ.2,500 వెల కట్టారు. చివరకు కొందరు గిరిజనులు వెన్నుపోటు పొడిచి కారుకొండ సుబ్బారెడ్డితో పాటు అతని అనుచరులను, మరికొందరు విప్లవ వీరులను 1858 జూన్ 11వ తేదీన బ్రిటీష్ వారికి పట్టించారు. 1858 అక్టోబర్ 7వ తేదీన కోర్టు విచారణ అనంతరం 8 మందిని అండమాన్ జైలుకు పంపారు. 35 మంది గిరిజన వీరుల్ని గుంటూరు దగ్గరున్న జైలులో యావజ్జీవ కారాగార శిక్ష విధించారు. కారుకొండ సుబ్బారెడ్డి, కుర్ల సీతారామయ్యలను బుట్టాయగూడెంలో ఉరి తీశారు. మిగిలిన ఆరుగురిని పోలవరం సమీపంలో ఉన్న దివానం వద్ద ఉరి తీశారు. కారుకొండ సుబ్బారెడ్డి చేసిన పోరాటానికి కోపోద్రిక్తులైన బ్రిటీష్‌వారు సుబ్బారెడ్డి మరణించిన తర్వాత అతడి మృతదేహాన్ని చిన్న బోనులో పెట్టి రాజమండ్రి దగ్గర ఉన్న కోటగుమ్మం వద్ద ప్రజలు చూసేవిధంగా వేలాడదీశారు. స్వాతంత్ర్యం రావడానికి కొన్నేళ్ల ముందు వరకూ కూడా సుబ్బారెడ్డి మృతదేహం కోటగుమ్మం వద్ద వేలాడుతూ ఉండేదని పాతతరం వారు చెబుతున్నారు. బ్రిటీష్ వారిపై తిరుగుబాటు చేసి ఉరి కొమ్ములకు వేలాడిన ఆ అమర వీరుల పోరు అజరామరం.



బ్రిటిష్ వారిపై తిరుగుబాటు చేసిన వీరులను ఉరి తీసిన పాత పోలవరం దివాణం భవనం



పాత పోలవరంలో బ్రిటీష్ వారు స్వాధీనం చేసుకున్న రెడ్డిరాజుల భవనం శిథిలావస్థలో ఉన్న దృశ్యం



బ్రిటీష్ వారిపై పోరాటం చేసి మరణించిన వీరుల గ్రామం కొరుటూరు ముంపునకు గురై శిథిలావస్థలో ఉన్న దృశ్యం

గుర్తింపు ఇవ్వాలి



గిరిజన స్వాతంత్ర్య సమర యోధుల కుటుంబాలను గుర్తించి ప్రభుత్వం వారిని అన్ని విధాలుగా ఆదుకోవాలి. కేఆర్‌పురం ఐటీడీఏకు కారుకొండ సుబ్బారావు పేరు పెట్టాలి. గిరిజన స్వాతంత్ర్య పోరాట యోధులకు తగిన గౌరవం ఇవ్వాలి.

– అయినారపు సూర్యనారాయణ, ఆదివాసీ మహాసభ న్యాయ సలహాదారు

తెల్లదొరలపై పోరాడారు



నేను గిరిజన వీరుడు కారుకొండ సుబ్బారెడ్డి ముని మనవడను. మాది పోలవరం మండలం కొంద్రుకోట. తెల్లదొరలపై మా తాత చేసిన పోరాటాన్ని మా పెద్దలు మాకు ఎప్పుడూ చెబుతూ ఉండేవారు. సమరయోధుల కుటుంబానికి చెందిన మాకు ఎటువంటి గుర్తింపు లేదు. ప్రభుత్వం ఇప్పటికైనా గుర్తించి మమ్మల్ని అన్ని విధాలుగా ఆదుకోవాలి.

– కారుకొండ అబ్బాయిరెడ్డి, కొంద్రుకోట

వాగులు పొంగి.. పొలాలు నీటమునిగి



కొవ్వలిలో నీటమునిగిన వరి పొలాలు

దెందులూరు: భారీ వర్షాలకు కొవ్వలిలో మొండికోడు, బుడమేరు వాగులు పొంగిపొర్లుతున్నాయి. రెండు వాగుల వరద ఉద్ధృతికి కొవ్వలిలో 100 ఎకరాలు వరి పంట ముంపునకు గురైంది. ఈ రెండు వాగులు వరద పెరిగినా, వర్షాలు ఆగకపోయినా కొవ్వలిలో మరింత ముంపునకు గురయ్యే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. దెందులూరులో సైఫెన్‌పై నీటి ప్రవాహం క్రమేపీ పెరుగుతోంది. పెరుగుతున్న నీటి ప్రవాహాన్ని అంచనా వేసి దెందులూరు తహసీల్దార్ బీ.సుమతి, ఎస్సై ఆర్ శివాజీ సైఫన్ పై రాకపోకలను నిలుపుదల చేశారు. స్టాప్ బోర్డులను ఏర్పాటు చేశారు. సైఫన్‌లో బ్రిడ్జిల వద్ద కాపలాగా గ్రామస్థాయి ఉద్యోగులను ప్రత్యేక డ్యూటీలు వేసి రెండు వైపులా పెట్టారు. చిన్న దళిత వాడ వద్ద పైనుంచి వచ్చే వర్షపు నీరు సీతంపేట కాలువ నుంచి బయటకు రాకుండా ముందుగానే అధికారులు, రైతులు సంయుక్తంగా ఇసుక బస్తాలను రక్షణ గోడగా రెండుచోట్ల ఏర్పాటు చేశారు. జాతీయ రహదారిపై సర్వీస్ రోడ్‌లో పొలాలకు వెళ్లే దారి గండి పడింది. పైనుంచి వర్షపు నీరు అధికంగా రావటంతో పొలాలకు వెళ్లే రైతులకు అసౌకర్యం కలిగింది. రోడ్డు పక్కన 10 ఎకరాలు వరి పొలం నీట మునిగింది.



ఉద్ధృతంగా ప్రవహిస్తున్న బుడమేరు

నిండా ముంచేను

గణపవరం: భారీ వర్షంతో గణపవరం, కొత్తపల్లి, చినరామచంద్రపురం, కేశవరం, పిప్పర, మొయ్యేరు, కొందేపాడు తదితర గ్రామాల్లో వరి చేలు ముంపుబారిన పడ్డాయి. బుధవారం రాత్రి భారీ వర్షం కురవగా గణపవరం, చినరామచంద్రపురం ప్రాంతాల్లో చేలల్లో మోకాలి లోతు నిలిచిపోయింది. మండల వ్యవసాయ అధికారి ఆర్‌ఎస్ ప్రసాద్, వ్యవసాయ సిబ్బంది నష్టం అంచనాలు తయారుచేస్తున్నారు. మండలంలో 650 హెక్టార్ల విస్తీర్ణంలో వరి నాట్లు నీటమునిగినట్టు అంచనా వేశారు. అలాగే మండలంలోని పంట, మురుగు కాల్వలు నిండుకుండల్లా ప్రవహిస్తున్నాయి. గట్లు బలహీనంగా ఉన్న చోట్ల రైతులు మట్టితో గట్లను పటిష్టం చేసుకుంటున్నారు. పలుచోట్ల కాలువలకు గండ్లు పడగా రైతులు చేలు మునగకుండా కాపాడుకుంటున్నారు. భారీ వర్షంతో గణపవరం నుంచి భీమవరం వెళ్లే రోడ్డు గోతులమయంగా మారి ప్రయాణం ప్రమాదకరంగా తయారైంది.



పిప్పరలో నీటమునిగిన వరిచేలు

సత్యనారాయణపురంలో చోరీ

ఆకివీడు: మండలంలోని పెదకాపవరం శివారు సత్యనారాయణపురం గ్రామంలో తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో చోరీ జరిగింది. గ్రామంలోని ఇందుకూరి సూర్యనారాయణరాజు బుధవారం ఉదయం తన ఇంటికి తాళం వేసి పిప్పర గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లాడు. తిరిగి గురువారం ఉదయం ఇంటికి వచ్చేసరికి తాళం బద్దలుకొట్టి ఉండడంతో లోపలికి వెళ్లి చూడగా బీరువా తాళాలు తెరిచి ఉండడం, సుమారు రూ.1.60 లక్షల విలువైన ఆరు కాసుల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై హనుమంతు నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోడ కూలి యువకుడి మృతి

ఏలూరు టౌన్: టిప్‌టాప్ దుకాణంలో కూలీగా పనిచేస్తున్న ఓ యువకుడిపై గోడ కూలిపోవటంతో మృతిచెందాడు. దీంతో ఆ కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టారు. ఏలూరు నగరానికి చెందిన కోన సాయి (22) బాల బాలాజీ అనే టిప్‌టాప్ కంపెనీలో టెంట్లు వేసే కూలీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తంగెళ్ళమూడి ప్రాంతంలో నూతన భవన నిర్మాణానికి భూమిపూజ కోసం బుధవారం టెంట్లు వేశారు. అనంతరం గురువారం టెంట్లు తొలగించేందుకు సాయి అక్కడికి వెళ్లాడు. బుధవారం రాత్రి భారీ వర్షంతో గోడలు పూర్తిగా నానిపోయి ఉన్నాయి. ఈ నేపథ్యంలో టెంట్లు తీస్తూ ఉండగా ఆకస్మికంగా గోడ అతనిపై కూలిపోవడంతో సాయి అక్కడికక్కడే మృతిచెందాడు. దీంతో అతని బంధువులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. తమకు న్యాయం చేయాలంటూ మృతదేహంతో రోడ్డుపై బైఠాయించారు. సమాచారం అందుకున్న ఏలూరు టూటౌన్ సీఐ అశోక్‌కుమార్ ఘటనా స్థలానికి వెళ్లి కుటుంబ సభ్యులకు నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



రోదిస్తున్న మృతుడి బంధువులు

ద్వారకాతిరుమలలో లారీ బీభత్సం

- రెండు కార్లను, ఒక ఆటోను ఢీకొట్టిన లారీ
- ఆటో డ్రైవర్‌కు గాయాలు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో గురువారం తెల్లవారుజామున ఒక లారీ బీభత్సాన్ని సృష్టించింది. గుడి సెంటర్‌లో రెండు కార్లను, గరుడాళ్వార్ సెంటర్‌లో రోడ్డు మధ్యలోని డివైడర్ మీద నుంచి దూసుకెళ్లి ఒక టాటా ఏస్ ఆటోను ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన సమయంలో ఆ ప్రాంతాల్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. స్థానికుల కథనం ప్రకారం. ద్వారకాతిరుమల క్షేత్రంలో బుధవారం రాత్రి భారీగా వివాహాలు జరిగాయి. పెదపాడు మండలం అప్పన్నవీడు గ్రామానికి చెందిన మాతంగి వెంకటేష్ తన ఆటోలో పెళ్లి బృందాన్ని క్షేత్రానికి తీసుకొచ్చాడు. వారిని కల్యాణ మండపం వద్ద దింపిన తరువాత గరుడాళ్వార్ సెంటర్‌లోని దేవస్థానం బస్‌స్టేషన్ వద్ద ఆటోను నిలిపి, అందులో నిద్రిస్తున్నాడు. అలాగే మచిలీపట్నం, విశాఖపట్నంకు చెందిన పెళ్లి బృందాలు వేసుకొచ్చిన రెండు కార్లను గుడి సెంటర్‌లో నిలిపి, కల్యాణ మండపాల్లోకి వెళ్లారు. గురువారం తెల్లవారుజాము 2 గంటల సమయంలో చింతలపూడి నుంచి కాకినాడకు వెళుతున్న ఒక లారీ గుడి సెంటర్‌లో నిలిపి ఉన్న రెండు కార్లను ఢీకొట్టింది. అక్కడి నుంచి ఆగకుండా వెళ్లిన లారీ గరుడాళ్వార్ సెంటర్ వద్ద డివైడర్‌పైకి దూసుకెళ్లి రోడ్డుకు అవతల వైపు దేవస్థానం బస్ షెల్టర్ వద్ద నిలిపి ఉన్న ఆటోను ఢీకొట్టింది. ఆటో పక్కనే ఉన్న విద్యుత్ స్తంభానికి తగలడంతో స్తంభం కాస్తా విరిగిపోయింది. ఈ ప్రమాదంలో ఆటోలో నిద్రిస్తున్న డ్రైవర్ వెంకటేష్‌కు గాయాలయ్యాయి. రెండు కార్లు, ఆటో ధ్వంసమయ్యాయి. ఈ ప్రమాదానికి లారీ డ్రైవర్ మద్యం మత్తే కారణమని పోలీసులు గుర్తించారు.

వర్షం వల్ల తప్పిన పెను ప్రమాదం..

క్షేత్రంలో వివాహాలు జరిగే ప్రతిసారి రహదారులు పెళ్లి జనాలతో రద్దీగా ఉంటాయి. అయితే బుధవారం రాత్రి కుండపోత వర్షం కురవడంతో పెళ్లివారు ఎవరూ రోడ్లపైకి రాలేదు. దాంతో ఈ ప్రమాదంలో ప్రాణనష్టం జరగలేదు. గురువారం ఉదయం విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది విరిగిపోయిన విద్యుత్ స్తంభాన్ని తొలగించి, కరెంటు సరఫరాను పునరుద్ధరించారు. ప్రమాదానికి కారణమైన కాకినాడకు చెందిన లారీ డ్రైవర్ చెరుకూరి లక్ష్మీపతిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు.



ద్వారకాతిరుమలలోని గరుడాళ్వార్ సెంటర్లో దేవస్థానం బస్‌స్టాప్ వద్ద ఆటోను ఢీకొట్టిన లారీ

రాష్ట్రపతి విశిష్ట పురస్కారానికి పెద్దిరాజు ఎంపిక



శృంగవృక్షం చెందిన సీబీఐ అధికారి బండి పెద్దిరాజు

పాలకోడేరు: సీబీఐ అధికారి పాలకోడేరు మండలం శృంగవృక్షం (బంటుమిల్లి) గ్రామానికి చెందిన బండి పెద్దిరాజు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అందించే రాష్ట్రపతి పోలీస్ పురస్కారానికి ఎంపికయ్యారు. ప్రస్తుతం న్యూఢిల్లీలోని కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) ప్రధాన కార్యాలయం సైబర్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డివిజన్‌లో ఆయన అదనపు పోలీసు సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. 1993లో సీబీఐలో కానిస్టేబుల్‌గా చేరిన ఆయన తన 32 ఏళ్ల సర్వీసులో ఇప్పటివరకు 150 పైబడి రివార్డులు అందుకున్నారు. 2008లో ఇండియా ఉత్తమ దర్యాప్తు అధికారి గోల్డ్ మెడల్, 2017లో ఇండియన్ పోలీస్ మెడల్ – ఐపీఎం, 2014, 2018లో రెండుసార్లు అత్యుత్తమ దర్యాప్తు అధికారి అవార్డులు, 2019లో 'డేటా సెక్యూరిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అవార్డు – ఇండియా సైబర్ కాప్ ఆఫ్ ది ఇయర్' పొందారు. 1997లో సబ్ ఇన్‌స్పెక్టర్, 2003లో ఇన్‌స్పెక్టర్, 2016లో డిప్యూటీ ఎస్పీ, 2023లో అడిషనల్ ఎస్పీగా ఉద్యోగోన్నతులు పొందారు.

కేసుల దర్యాప్తులో కీలకపాత్ర

రామర్ హెర్బల్ ఫ్యూయల్ కేసు, పరిటాల రవి హత్య కేసు, న్యాయవాది సతీష్ హత్య అండ్ అంతర్రాష్ట్ర నారాయణన్ హత్య కేసులను మద్రాస్ హైకోర్టు ఆయనకు అప్పగించింది. ఏపీ హైకోర్టు న్యాయమూర్తులపై అసభ్యకరమైన సోషల్ మీడియా పోస్టుల కేసులు, బిట్స్ పిలానీ ఆన్‌లైన్ పరీక్ష కుంభకోణం, అంతర్జాతీయ ఆన్‌లైన్ పిల్లల లైంగిక వేధింపుల కేసు, మైక్రోసాఫ్ట్, అమెజాన్‌లను అనుకరిస్తూ అంతర్జాతీయ టెక్ సపోర్ట్ స్కామ్‌లు వంటి హై ప్రొఫైల్ కేసులను ఆయన దర్యాప్తు చేశారు. ఇటీవల ఆయన నీట్ 2024 ప్రశ్నపత్రం లీకేజ్ కేసులో చీఫ్ ఇన్వెస్టిగేటింగ్ ఆఫీసర్‌గా పని చేశారు. అక్కడ ఆయన ప్రయత్నాలు 45 మంది నిందితులను అరెస్టు చేయడానికి, సమగ్ర చార్జిషీట్‌లను దాఖలు చేయడానికి ఉపయోగపడ్డాయి. బండి పెద్దిరాజుకు రాష్ట్రపతి పోలీసు పతకం లభించడంపై శృంగవృక్షం శ్రీ వాసవీ ఆర్య వైశ్య సంఘం, వాసవీ క్లబ్, గ్రామాభివృద్ధి కమిటీ హర్షం వ్యక్తం చేశాయి.

ఉపాధ్యాయులకూ పరీక్షే

- విద్యార్థి సామర్థ్యానికి మించి ప్రశ్నలు
- సిలబస్‌లో లేని ప్రశ్నలు ఇస్తుండటంతో తలలు పట్టుకుంటున్న ఉపాధ్యాయులు

'ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాలల్లో ఎఫ్ఏ-1 పరీక్షల గురించి ఆరా తీస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్..'

'ఎఫ్ఏ1 పరీక్షల స్ట్రాటజీని చూసి హార్వర్డ్, కేంబ్రిడ్జ్ యూనివర్సిటీల డీన్స్ సైతం ఆశ్చర్యపోయి ముక్కున వేలేసుకున్న వైనం..'

ఇవీ ఉపాధ్యాయుల, ఉపాధ్యాయుల సంఘాల వాట్సాప్ గ్రూపుల్లో, వాట్సాప్ ఛానల్స్‌లో చక్కర్లు కొడుతున్నాయి.

నూజివీడు : కూటమి ప్రభుత్వం అడ్డగోలు నిర్ణయాలు తీసుకుంటూ ప్రభుత్వ విద్యారంగాన్ని భ్రష్టుపట్టిస్తోందన్న వాదన వినిపిస్తోంది. ఇప్పటికే పాఠశాలల విలీనం చేసి తొమ్మిది రకాల పాఠశాలలను తీసుకురావడమే కాకుండా క్లస్టర్ విధానంను తీసుకువచ్చి అస్తవ్యస్తం చేసిన ప్రభుత్వం ఇప్పుడు పరీక్షల తీరు చూస్తుంటే పరిస్థితులు అత్యంత దారుణంగా ఉందని ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. సిలబస్‌లో చెప్పిన పాఠాలు ఒకటైతే పరీక్షల్లో ఇస్తున్న ప్రశ్నలు వేరేగా ఉన్నాయని, గణితం గాని, ఇంగ్లిష్ గాని సిలబస్‌లో పాఠ్యపుస్తకంలో చెప్పిన లెక్కలు నుంచి ఒక్క ప్రశ్న కూడా ఇవ్వలేదని ఉపాధ్యాయులు వాపోతున్నారు. ఇలా ఇస్తే విద్యార్థులు ఎలా పరీక్షలు రాయగలరని వారు ప్రశ్నిస్తున్నారు. ఈ పరీక్షలు చూస్తుంటే విద్యార్థులకు పెట్టినట్లు లేదని, ఉపాధ్యాయులకు పరీక్షలు అన్నట్లు ఉందని వాపోతున్నారు. ఈనెల 11 నుంచి నిర్వహిస్తున్న ఎఫ్ఏ-1 పరీక్షల తీరు, ప్రశ్నాపత్రాల రూపొందించిన విధానం పరిశీలిస్తే ఉపాధ్యాయులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులకు మార్కులు రాకుండా ప్రభుత్వ పాఠశాలలను మరింత బలహీనం చేసేందుకే ఇలా చేస్తున్నారా అనే అనుమానాలను ఉపాధ్యాయులు వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివించిన, ప్రభుత్వం నిర్దేశించిన సిలబస్ ఒకటైతే ప్రశ్నాపత్రాలలో ఇచ్చింది మరొకటి కావడం గమనార్హం. దీనిపై ఉపాధ్యాయ వర్గాల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. దీనివల్ల చదివే పిల్లలు కూడా ఉపాధ్యాయులు చెప్పే ప్రశ్నలు చదివినా పరీక్షల్లో రావని చదవకుండా ఉండే అవకాశం ఉందని ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రశ్నాపత్రాలు తయారు చేసే వారు ఒకసారి ఆలోచించి చదివినవి, సిలబస్‌లోనుంచి ఇస్తే కనీసం ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల చదువులు ముందుకు వెళ్తాయని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. అన్ని ప్రశ్నలు కూడా అప్లికేషన్ మెథడ్‌లో ఇవ్వడం వల్ల చదివే వాళ్లు కూడా చదవకుండా పోయే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. పరీక్షలనేవి విద్యార్థులు నేర్చుకున్న అంశాలను, వివిధ ప్రశ్నల ద్వారా అంచనా వేసే విధంగా ఉండాలే తప్ప భయపెట్టే విధంగా వారి స్థైర్యాన్ని దెబ్బతీసేలా ఉండకూడదని అంటున్నారు. ఒకటో తరగతి విద్యార్థికి ఏప్రిల్ నెలలో నేర్చుకోబోయే సిలబస్‌లో ప్రశ్నలు ఆగస్టులో జరిగే యూనిట్ పరీక్షలు ఇవ్వడంపై ఉపాధ్యాయులు విస్మయానికి గురవుతున్నారు.

పరీక్షల్లో ఇచ్చిన కొన్ని ప్రశ్నలు ఇలా..

ఒకటో తరగతి పిల్లలు ఇప్పుడిప్పుడే పాఠశాలలకు అలవాటు అవుతున్నారు. ఇంకా కొందరు పాఠశాలకు రావడానికి మొరాయిస్తున్నారు. వీరు ఇప్పుడిప్పుడే తెలుగు, ఇంగ్లిష్ అక్షరాలను గుర్తు పడుతున్నారు. అలాంటి పిల్లలకు ఇంగ్లిష్‌లో పేరాగ్రాఫ్ ఇచ్చి దానిని విని ఇంగ్లిష్‌లోని ప్రశ్నలకు సమాధానాలు రాయడం, పదాలు తయారు చేయడం చేయాలి. అలాగే మూడో తరగతి విద్యార్థి తెలుగులో పుస్తక సమీక్ష చేసి, ఆ సమీక్షను సమర్పణ చేయాలి. అలా చేసినప్పుడే వాటికి మార్కులు ఇవ్వాలి. మూడో తరగతి ఆంగ్ల భాష పరీక్షకు నాలుగో తరగతిలోని పాఠాల నుంచి ప్రశ్నలు ఇచ్చారు. ఎస్‌సీఈఆర్టీలో ప్రశ్నాపత్రాలు రూపొందించే వారికి విద్యార్థి స్థాయి, సామర్థ్యంపై కనీస అవగాహన ఉండటం లేదని ఉపాధ్యాయులు అభిప్రాయ పడుతున్నారు. ఉపాధ్యాయులను, విద్యార్థులను ఇబ్బంది పెట్టడానికి తప్ప ఈ పరీక్షలు దేనికి ఉపయోగమనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.





ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న పరీక్షలపై వాట్సాప్ గ్రూపుల్లో తిరుగుతున్న కార్టూన్‌లు

క్లుప్తంగా

జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలి


షేక్ సికిందర్ భాషా

తాడేపల్లిగూడెం (టీఓసీ): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు సెప్టెంబర్ 13వ తేదీన తాడేపల్లిగూడెం న్యాయస్థానాల సముదాయంలో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, 11వ అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ భాషా వెల్లడించారు. పట్టణంలో గురువారం ఆయన మాట్లాడుతూ రాజీపడదగిన క్రిమినల్, సివిల్ కేసులు, మోటార్ వాహన ప్రమాద బీమా కేసులు, చెక్ బౌన్స్ కేసులు, బ్యాంక్ కేసులను రాజీ చేసుకోవచ్చని తెలిపారు. రాజీ మార్గమే రాజ మార్గమని, రాజీ మార్గం ద్వారా కేసులను సత్వరమే పరిష్కరించుకోవాలని, సమయం, డబ్బు వృథా కాకుండా లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

దివ్యాంగులకు ‘ఉచిత బస్సు’ కల్పించాలి


రాఘవేంద్రరెడ్డి

తాడేపల్లిగూడెం (టీఓసీ): దివ్యాంగులకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించాలని ఎన్‌పీఆర్‌డీ జిల్లా ఉపాధ్యక్షుడు మేడపాటి వీర వెంకట రాఘవేంద్రరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రకటించిందని తెలిపారు. ప్రస్తుతం దివ్యాంగులకు 50 శాతం రాయితీతో పరిమితి బస్సుల్లో పాస్ అమలు అవుతుందన్నారు. 100 శాతం రాయితీతో ఉచిత ప్రయాణం అమలు చేయాలని, ఉచిత బస్సు పాస్‌ను ఇవ్వాలని, అన్ని బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే సౌకర్యాన్ని దివ్యాంగులకు కల్పించాలని డిమాండ్ చేశారు. లక్ష్మణరావు, శ్రీను, వీర్రాజు, పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ పునఃప్రతిష్ఠ


అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: తణుకు మండలం యర్రనీలిగుంట గ్రామంలో విజయదుర్గమ్మ ఆలయ పునఃప్రతిష్ఠ కార్యక్రమానికి మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు హాజరయ్యారు. ఆలయాన్ని నూతనంగా తీర్చిదిద్ది విజయదుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా చేశారు. ఈ సందర్భంగా గురువారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 12వ తేదీ నుంచి జరుగుతున్న పూజాధికాల్లో భాగంగా నిర్వహిస్తున్న హోమాల్లో పాల్గొని వేద పండితుల ఆశీర్వచనాలు తీసుకున్నారు. అమ్మవారి నూతన విగ్రహాన్ని చూసేందుకు భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. హాజరైన సుమారు 9 వేల మంది భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మాజీ మంత్రి కారుమూరికి ఘనస్వాగతం పలికారు. పూజాధికాల్లో ఆలయ కమిటీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

వ్యాస రచన పోటీల్లో విజయమణికి పురస్కారం


పురస్కారం అందుకుంటున్న విజయమణి

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక శ్రీవాసవి డిగ్రీ కళాశాల విద్యార్థిని ఎం.విజయమణి మాజీ మంత్రి సీహెచ్ వీవీ మూర్తిరాజు స్మారక పురస్కారం నిడమర్రు మండలంలోని పెదనింద్రకొలను గ్రామంలో గురువారం అందుకున్నారు. గాంధీజీ ఆశించిన సురాజ్యం, నేటి పరిస్థితి అనే అంశంపై ఇటీవల భీమవరంలో వ్యాస రచన పోటీలు నిర్వహించారు. విద్యార్థినిని అధ్యాపకులు కేవీ సత్యప్రకాశ్, కళాశాల యజమాన్యం అభినందించారు.

స్వాతంత్య్రోద్యమ పోరాట యోధుల గడ్డ


వైఎస్సార్ పార్కులో ఏర్పాటు చేసిన దేశ నాయకుల విగ్రహాలు

తణుకు అర్బన్: స్వాతంత్య్రోద్యమ పోరాట యోధులు కొలువు తీరిన తణుకు గడ్డ భావితరాలకు స్ఫూర్తి నింపే వేదికగా పేరుగాంచింది. స్వాతంత్రోద్యమ పోరాట ఉద్యమం తణుకులో కూడా కొనసాగిందనే ఊహ ఎంతో కీర్తిని తీసుకొచ్చింది. అటువంటి మహనీయుల విగ్రహాలు తణుకులో స్వాతంత్రోద్యమ పోరాట స్ఫూర్తిని తెలుపుతుంది. అటువంటి పోరాటయోధుల పుట్టిన గడ్డగా తణుకు చరిత్ర పుటల్లో నిలిచింది. ఉద్యమంలో భాగంగా జాతిపిత మహాత్మాగాంధీ రెండు పర్యాయాలు తణుకులో అడుగుపెట్టి ఉద్యమ స్ఫూర్తిని రగిలించగా, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో కొంతకాలం విద్యాభ్యాసాన్ని చేశారు. అటువంటి మహనీయుల స్ఫూర్తితో స్వాతంత్రోద్యమ పోరాటంలో ఉద్యమాన్ని నడిపి జైలు జీవితం గడిపిన పోరాటయోధులు తణుకులో 30 మందికి పైగా ఉన్నారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొలువులో మంత్రిగా ఉన్న కారుమూరి తణుకు బ్యాంక్ కాలనీలోని పార్కుకు స్వాతంత్య్ర సమరయోధుల ఉద్యానవనంగా నామకరణం చేయించి 18 మంది స్వాతంత్య్ర యోధుల విగ్రహాలను ఏర్పాటు చేశారు. విగ్రహాల ఏర్పాటులో పాత్రికేయులు బెల్లంకొండ బుచ్చిబాబుకీలక భూమిక పోషించారు.

విగ్రహాల ఏర్పాటు తృప్తినిచ్చింది



తణుకు గడ్డపై యువతకు స్వాతంత్య్రోద్యమ స్ఫూర్తి కలిగించాలనే ఉద్దేశ్యంతో స్వాతంత్య్ర పోరాట యోధుల విగ్రహాలను తణుకు బ్యాంక్ కాలనీలోని పార్కులో ఏర్పాటు చేయించాను. స్వాతంత్రోద్యమంలో నేరుగా పాల్గొని జైలు జీవితం అనుభవించిన యోధులు తణుకులో పుట్టారనే విషయం చాలా మందికి తెలియదు. పోరాట యోధుల విగ్రహాల ఏర్పాటు సంతృప్తినిచ్చింది.

– కారుమూరి వెంకట నాగేశ్వరరావు, మాజీ మంత్రి

భారీ వర్షంతో జనజీవనం అస్తవ్యస్తం


తాడేపల్లిగూడెం (టీఓసీ): జలమయమైన వీధులు


తాడేపల్లిగూడెం (టీఓసీ): వర్షపు నీటిలో ఆర్టీసీ బస్సు కాంప్లెక్స్ ఆవరణ


అత్తిలి: తిరుపతిపురంలో ముంపులో ఉన్న పంట చేలు


తాడేపల్లిగూడెం రూరల్: రహదారిపై నుంచి ప్రవహిస్తున్న నీరు


ఇరగవరం: ఉధృతంగా ప్రవహిస్తున్న గొంతేరు డ్రెయిన్

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో బుధవారం సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి వరకు కురిసిన కుండపోత వర్షం కారణంగా పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. గురువారం ఉదయం అనేక స్థలాలు, పల్లపు ప్రాంతాలు, పలు పాఠశాలల ఆవరణలు, ఆర్టీసీ కార్యాలయం ఆవరణ వర్షపు నీటితో దిగ్బంధం అయ్యాయి. ఆవరణలోని కొన్ని షాపుల వద్ద నీరు ఉండటంతో షాపులు తెరవలేదు. పట్టణంలోని మురుగు డ్రెయిన్లు, అవుట్ లెట్లు నీరు లాగకపోవడంతో ఎక్కడ నీరు అక్కడే నిలిచి ఉంది. ఇళ్లలోకి చేరిన నీరు అలానే ఉంది. అనేక ప్రాంతాల్లో వర్షపు నీటి కారణంగా మురుగు కాలువల్లో ఉన్న వ్యర్థాలు రోడ్డుపైకి చేరాయి. ఎక్కడ చూసిన చెత్తాచెదారాలు ఉండటంతో అవి దుర్వాసన వెదజల్లుతున్నాయి. ఇదిలా ఉంటే బుధవారం రాత్రి కురిసిన వర్షం, ఈదురు గాలులతో విద్యుత్ సరఫరాకు అంతారయం ఏర్పడింది. అర్ధ రాత్రి 12.30 ప్రాంతంలో విద్యుత్‌ను పునర్ధరించారు.

ముంపు బారినపడ్డ పంట చేలు

అత్తిలి: ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి అత్తిలి మండలంలో పలు ప్రాంతాల్లో వరిచేలు ముంపుబారిన పడ్డాయి. మండలంలో ప్రధాన మురుగు నీటి డ్రెయిన్లు పొంగి ప్రవహించడంతో పరీవాహక పంటచేలు నీట మునగాయి. ఆరుదల కోడు డ్రెయిన్ పరిధిలో తిరుపతిపురం, వరిఘేడు గ్రామాల ఆయకట్టుతో పాటు అత్తిలి, బల్లిపాడు ఆయకట్టు ప్రాంతం ముంపు బారిన పడింది. వర్షం నీరు బయటకు వెళ్లేందుకు సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో ప్రతి ఏడాది వర్షాకాలంలో పంట చేలు ముంపుబారిన పడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పొంగిపొర్లిన డ్రెయిన్లు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలో బుధవారం రాత్రి కుండపోత వర్షం కురిసింది. దీంతో డ్రెయిన్లు ఉధృతంగా ప్రవహించాయి. చినతాడేపల్లి, మెట్ట ఉప్పరగూడెం, మోదుగ గుంట, కొండ్రుప్రోలు తదితర గ్రామాల్లో వరి చేలు నీట మునిగాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఏకధాటిగా నాలుగు గంటల పాటు వర్షం కురవడంతో చేలు, మురుగు డ్రెయిన్లు తేడా లేకుండా పోయింది. 162.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ ఎం.సునీల్‌కుమార్ తెలిపారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న డ్రెయిన్లు

ఇరగవరం: మండలంలో బుధవారం కురిసిన భారీ వర్షాలు ఇరగవరం, అర్జునుడుపాలెం, గోటేరు, రేలంగి, కత్త పాడు, కాకిలేరు, కొయ్యేటిపాడు, ఏలేటిపాడు, అయిన పర్రు, తూర్పు విప్పర్రు, కె.కుముదవల్లి, ఆర్.ఖండ్రిక , కావలిపురం గ్రామాల్లో పెద్ద ఎత్తున పొలాలు నీట మునిగాయి. తహసీల్దార్ సుందర్ రాజు మాట్లాడుతూ మండలంలో సుమారు 3200 ఎకరాల్లో పంట పొలాలు నీట మునిగాయని అయితే గురువారం పెద్దగా వర్షం లేకపోవడంతో భారీ ప్రమాదం నుంచి రైతులు బయట పడినట్లే అన్నారు.

కూటమి నేతల ఇష్టారాజ్యం

- కూల్చిన అక్రమ కట్టడాలు తిరిగి నిర్మాణం
- అటువైపే చూడని మునిసిపల్ అధికారులు


ఆరేళ్ల క్రితం కూలగొట్టిన అక్రమ నిర్మాణం (ఫైల్)

తాడేపల్లిగూడెం: సరిగ్గా ఆరు సంవత్సరాల క్రితం అక్రమ నిర్మాణమంటూ భారీ పోలీసు బందోబస్తు మధ్య మునిసిపల్ అధికారులు కూలగొట్టిన స్థలంలో కూటమి నేతలు రెచ్చిపోయి అచ్చంగా 16 లకారాలు వెచ్చించి తాజాగా దుకాణాలు కట్టారని నియోజకవర్గంలో ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. కూల్చివేత కట్టడం కథ ఏమిటంటే.. పట్టణంలోని సీతారాం పేట సమీపంలో ఉన్న గణేష్ రైస్‌మిల్లు ప్రాంతంలో వాణిజ్య భవన సముదాయం 2014లో నలుగురు భాగస్వాములుగా ఏర్పడి నిర్మించారు. ఈ సముదాయంలో ఒక విద్యా సంస్థకు కొంత భాగం అద్దెకిచ్చారు. ఈ సంస్థ తాలూకా పార్కింగ్ అవసరాలకు 4048.97 చదరపు మీటర్ల స్థలాన్ని మూడు అంతస్తుల భవనం కింద ఉంచారు. వ్యాపారంలో, రాజకీయ పార్టీల్లో పలు నేపథ్యాలు కలిగిన వలవల బాబ్జీ, మారం వెంకటేశ్వరరావు, ఈతకోట తాతాజీ,, తటవర్తి మల్లికార్జునరావు భాగస్వాములుగా ఈ నిర్మాణం చేపట్టారనేది సమాచారం. పార్కింగ్ స్థలంగా ఉండాల్సిన స్థలంలో కొంత కాలం గడిచాక దుకాణాలు నిర్మించి విక్రయించారు. 2019లో ఈ విషయంపై మున్సిపల్ అధికారులు రికార్డులను పరిశీలించారు. 4048.97 చదరపు మీటర్ల పార్కింగ్ స్థలంలో చేపట్టింది అక్రమ నిర్మాణంగా గుర్తించి, పోలీసుల మోహరింపు మధ్య అక్రమ నిర్మాణాన్ని యంత్రాలతో కూల్చివేశారు. అక్కడితో ఈ కథ ముగిసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కూటమిలో క్రియాశీలకంగా ఉన్న వ్యాపార భవన సముదాయ నిర్మాణదారులు, తిరిగి పార్కింగ్ స్థలంలో దుకాణాలు నిర్మించి విక్రయించేశారు. ఇంత జరుగుతున్నా మున్సిపల్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు, విషయం తమకేమి తెలియదన్నట్టు పట్టించుకోలేదు. ప్రస్తుతం ఈ నిర్మాణదారులుగా చెబుతున్న నలుగురిలో ఒకరు భవన నిర్మాణ కార్మికుల కార్పొరేషన్ చైర్మన్ వలవల బాబ్జీ (టీడీపీ) కాగా, మరో ముగ్గురు మారం వెంకటేశ్వరరావు (జనసేన), ఈతకోట తాతాజీ (బీజేపీ), తటవర్తి మల్లికార్జునరావుగా ప్రచారం జరుగుతోంది. గతంలో కూల్చేసిన ప్రాంతంలో తిరిగి నిర్మాణాల విషయంలో మున్సిపల్ అధికారులు ఏం చేస్తారనేది చూడాలి. గణేష్ రైస్ మిల్లు ప్రాంతంలో పార్కింగ్ స్థలంలో అక్రమ నిర్మాణాల విషయం మా దృష్టికి రాలేదని మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు చెప్పగా, టీపీఓ వాస్తవ పరిస్థితిని గమనించి, ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెప్పారు. మొత్తం మీద పాత విషయం మళ్లీ తెరమీదకు వచ్చింది.

డ్రగ్స్ నిర్మూలనలో యువత పాత్ర కీలకం


విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న సీఐ

తణుకు అర్బన్: డ్రగ్స్ నిర్మూలనలో యువత పాత్ర కీలకమని ఎక్సైజ్ సీఐ సత్తి మణికంఠరెడ్డి అన్నారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని మానవ ఆరోగ్యం, సమాజంపై డ్రగ్స్ ప్రభావం, డ్రగ్స్ నిర్మూలనలో యువత పాత్ర అనే అంశంపై తణుకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో తణుకు చిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, ఎక్సైజ్ ఎస్సైలు బి.లక్ష్మి, ఆర్.మధుబాబు పాల్గొన్నారు.

వసతి గృహాల నిర్వహణలో అలసత్వం వద్దు


తణుకు ఎస్సీ హాస్టల్‌లో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి.

తణుకు అర్బన్: వసతి గృహ నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి హెచ్చరించారు. గురువారం తణుకు ఎస్సీ వసతి గృహాన్ని ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. బుధవారం కురిసిన భారీ వర్షానికి వసతి గృహంలోకి వర్షపు నీరు రావడంపై ఆమె స్పందించారు. ఎస్సీ వసతి గృహంలోకి నీరు చేరుకున్న వెంటనే పిల్లలను సమీపంలోని బీసీ హాస్టల్‌లోకి మార్చడంలో కీలకంగా పనిచేసిన మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్లు తీసుకున్న చొరవ అభినందనీయమన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు సేవాతత్వంతో కూడిన నమ్మకమైన వైద్యాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. గురువారం తణుకు జిల్లా కేంద్ర ఆసుపత్రిని ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కాకర్లమూడి, సాయికిరణ్, ఆర్ఎంవో డాక్టర్ ఏవిఆర్ఎస్ తాతారావు, తహసీల్దార్ డీవీఎస్ఎస్ అశోక్ వర్మ, మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్ పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి


జెడ్పీ ఉన్నత పాఠశాలలో గ్రంథాలయ సభ్యత్వాలు నమోదు చేస్తున్న సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకొని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని పలువురు రిసోర్స్ పర్సన్లు ప్రత్తి వీరాస్వామి, ఏవీ లక్ష్మణరావు, ఎ.జనార్థనరావు, జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎం.సత్యనారాయణలు పేర్కొన్నారు. స్థానిక గరికిపాటి కళాపీఠం ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పేద విద్యార్థులకు సభ్యత్వాలు చేర్పించే కార్యక్రమం నిర్వహించారు. గ్రంథాలయ అధికారి వి.శ్రీనివాస్ రావు సమక్షంలో దాత కళా పీఠం నిర్వాహకులు జి.బాపయ్యశర్మ సొంత ఖర్చులతో 50 మంది పేద విద్యార్థులకు సభ్యత్వాలను అందజేసి, రసీదులు ఇచ్చారు. బాపయ్యశర్మ మాట్లాడుతూ సభ్యత్వాలు చేర్పించడం ద్వారా సభ్యత్వ కార్డులు ఇస్తారని తెలిపారు. గ్రంథాలయాలను విద్యార్థులు ఉపయోగించుకోవాలన్నదే అభిమతమన్నారు. విద్యార్థులు భవిష్యత్ భావి భారత పౌరులుగా ఎదిగేందుకు సభ్యత్వాలు ఎంతో ఉపయుక్తమన్నారు. ఉపాధ్యాయులు సీహెచ్ జకాఫ్ రాజు, శివ ప్రసాద్, భద్ర, శివ, విద్యార్థులు పాల్గొన్నారు.

కదంతొక్కిన ఆటో కార్మికులు


ఎల్.అగ్రహారం టిడ్కో గృహ సముదాయం వద్ద ఆటో కార్మికులు

తాడేపల్లిగూడెం రూరల్: ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్త్రీశక్తి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి వ్యతిరేకంగా గురువారం ఉదయం నుంచి 24 గంటల పాటు ఆటో యూనియన్ కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. తాడేపల్లిగూడెం ఏరియాలోని 27 ఆటో యూనియన్లకు చెందిన కార్మికులు పాల్గొన్నారు. ఆసుపత్రులు, స్కూల్స్ వెళ్లే ఆటోలు మినహా మిగిలిన ఆటోలు తిరగకుండా బంద్ పాటించారు. దీంతో పట్టణ ప్రాంతాల నుంచి గ్రామాలకు వెళ్ళే ప్రయాణీకులు ఇబ్బందులు పడ్డారు.

ఇరగవరంలో..

ఇరగవరం: ఉచిత బస్సుతో ఆటో డ్రైవర్లకు తీవ్ర నష్టం జరుగుతుందని వారిని కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ నాయుకులు కామన మునిస్వామి అన్నారు.

సంక్షేమ బోర్డు అమలు చేయాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఇచ్చిన హామీ మేరకు ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.